# రుధిరాశ్రువులు

సాయంత్రం వేళ పాత ఉత్తరాల దొంతర ముందు వేసుకున్నాను.

ఆ ఉత్తరాలను చూడగానే ఉద్వేగంతో ఊగిపోతాను. నెల కోసారి ఆ ఉత్తరాల కట్ట విప్పదీసి చదవందే మనస్సు నిలవదు. గొలుసు కట్టురాతతో నాన్న రాసినవి కొన్ని, ముత్యాల్లాంటి అక్షరాలతో అన్నయ్య రాసినవి మరికొన్ని.

నా చేతుల్లో ఆ ఉత్తరాలు ఉన్నప్పుడు అన్నయ్య, నాన్న పక్కన కూర్చుని ఆప్యాయంగా కబుర్లు చెప్పుకుంటున్నట్లుంటుంది.

వాళ్ళిద్దరూ ఈ లోకానికి సెలవు చెప్పేసి హడావుడిగా వెళ్ళిపోయారు. పాతిక సంవత్సరాల క్రితం వాళ్ళు రాసిన ఉత్తరాలివి.

ఆ ఉత్తరాల్లో జీవం లేదు. అవి కేవలం కాగితాలే ! కానీ ఉత్తరాల్లోని అక్షరాలు మాత్రం సజీవంగా చాలా సన్నిహితంగా ఉంటాయి. ఆ అక్షరాలను స్పృశిస్తే గుండెల్లో వేడి నెత్తురు ఉప్పొంగుతుంది. ఉత్తేజాన్ని ఇస్తుంది.

ఆ రేళ్ళ క్రితం నాన్న రాసిన ఉత్తరం మళ్ళీ చదవడం మొదలుపెట్టాను.

"ప్రియమైన చిరంజీవి కృష్ణకు,

నాన్న దీవించి రాయునది.

ఇచ్చట అంతా క్షేమం. మీ క్షేమ సమాచారములు తెలుపవలెను.

క్రిందటి సంవత్సర పత్తి చేనుకు తెల్లదోమ తగిలి సర్వనాశనమైంది. ఈ సంవత్సరం పురుగు పట్టింది. పత్తి చేతికి అందొచ్చే సమయానికి పాడైపోయి, ఎందుకూ పనికిరాకుండా పోయింది. అప్పు చేసి క్రిమి సంహారక మందులు తెచ్చి పత్తి చేసుకు చల్లినా ఫలితం లేకపోయింది. కల్తీ మందుల కాలం నాయనా ఇది!

ఏడాది కేడాది అప్పు పెరిగిపోతూ ఉంది. అమ్మ ఒంటి మీద బంగారం హారతి కర్పూరంలా కరిగిపోయింది. రెండెకరాలు మాగాణి రెండేళ్ళ క్రితమే అమ్మేసినా అప్పు తీరలేదు.

"పత్తి సాగు మానుకోవాలని ఊళ్ళో వాళ్ళందరూ గత పదేళ్ళ నుంచి అనుకుంటునే ఉన్నాము. అయినా ఏదో ఆశ మమ్మల్ని పత్తి సాగులోకి లాగేస్తున్నది. ఒక్క సంవత్సరం పత్తి బాగా దిగుబడి అయితే అయిదేళ్ళ అప్పులూ వడ్డీతో సహా తీరిపోతాయనే భ్రమలోనే ఉండిపోతున్నాము.

.... అప్పుల సుడిగుండంలో చిక్కుకుపోయినా ఈదడం మానలేదు. ఈ జీవితానికి ఎదురీత తప్పదురా!

.... నా గొడవ కేం గాని నీ ఉద్యోగం ఎలా ఉంది?"

.... అమ్మాయి ఇందిరకు ఆశీస్సులు. కోడలు పిల్లని ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమను... మనవడికి ముద్దులు....

"ఇంతే సంగతులు"

మీ నాన్న వెంకయ్య.

ఉత్తరం మడిచి పక్కన పెట్టాను.

నాన్న రూపం కళ్ళలో మెదిలింది. ఆ రదుగుల మనిషి. బుర్ర మీసాలతో గంభీరంగా ఉండేవాడు. నోట్లో ఎప్పుడూ లంక పొగాకుతో చుట్టిన చుట్ట వెలుగుతూ ఉండేది. తను బి.ఏ., చదివేనాటికి ఆస్తి అంతా పోయింది కాని, బాగా బతికిన మనిషి నాన్న. చిన్నప్పటి విషయాలు తన కింకా గుర్తే. మండువా లోగిడి ఇల్లు. ఇంటి ముందు పెద్ద ఆర్చీ. ఆ ఆర్చీ పైన కృష్ణుడి బొమ్మ. ఆ బొమ్మకి ఇరుపక్కలా మేత మేయడం మానేసి మురళీగాన మాధుర్యంలో మునిగిపోయినట్లుగా మోర ఎత్తి కృష్ణుడి వైపు చేస్తున్న ఆవులు సజీవంగా ఉన్నట్లుండేవి ఆ బొమ్మలు.

ఎప్పుడో గాలి వానకు ఆ ఆర్చీ పడిపోయినట్లు గుర్తు.

మొక్క జొన్న కండెలు పది పదిహేను తినేవాడట. వేరు శెనక్కాయమలు బుట్టెడు తినేసి, పెద్ద బెల్లం గడ్డ నిముషంలో సమిలేసేవాడట.

నాన్నకి ఈతంటే ఇష్టం. రోజూ గొడ్లని కాలువకి తోలుకు వెళ్ళేవాడు. అవి

కాలువగట్టున మేస్తూ ఉంటే తుమ్మచెట్టు నీడలో కూర్చుని చుట్ట తాగుతూ కాలక్షేపం చేసేవాడు.

అరవయ్యేళ్ళు పై బడ్డా కాలువలో దిగి పశువుల్ని కడగటం, ఈత కొట్టడం మానలేదు నాన్న. డెబ్బయ్యోవడిలో – పడ్డాక ఓపిక తగ్గి ఈతకొట్టడం మానేశాడు.

నాన్న జీవితంలో ముగింపు కూడా విచిత్రంగానే జరిగింది.

కాలువలోకి దిగిన గొడ్లను చూస్తూ గట్టు మీదే కూర్చుండిపోయాడు నాన్న. ఎంతసేపు గడిచినా కాలువలో నుంచి గట్టు మీదకు వచ్చే ప్రయత్నం చేయలేదు గొడ్లు. మట్టి గడ్డలు విసిరి వాటిని అదిలించే ప్రయత్నం చేశాడు గాని, అవి ఒడ్డుకు రాలేదు.

నాన్నకు కాలువలోకి దిగాలనిపించింది. పూర్తిగా సడలిపోయిన ఒంట్లో సత్తువ మీద ఆయనకు ఏదో నమ్మకం. చొక్కా విప్పేసి, పంచె తొడల మీదకు ఎగగట్టుకుని నీళ్ళల్లోకి దిగాడు.

"ముసలాడివి నువ్వెందుకే నీళ్ళల్లో దిగుతావ్?" దగ్గర్లో గొడ్లు కాస్తున్న కుర్రాడు నాన్నను వారించే ప్రయత్నంలో అన్నాడు.

వాడి మాటలు లెక్క చేయకుండా కాలువ మధ్యలోకి ఈదుకుంటూ వెళ్లాడు. గొడ్లను గట్టు మీదకు తోలాడు.

కాలువ ప్రవాహం నాన్నకు ఎదురు తిరిగింది. పదేళ్ళ వయసులో నేర్చుకున్న ఈత కొత్త పాఠాలు చెప్పింది. ఈతకు పనికిరావని నాన్నకు తెగేసి చేప్పేసింది. ఆయాసం, దడతో ఉక్కిరి బిక్కిరయ్యాడు నాన్న. కాళ్లు, చేతులు స్వాధీనం తప్పుతున్నాయి.

ఈత కొట్టడమంటే నాన్నకు ఆరో ప్రాణం. చివరకు ఈత కొడుతూనే ప్రాణాలు వదిలేశాడు.

నాన్న చనిపోయినా ఆయన రూపాన్ని సజీవంగా ఎదరుగా నిలిపేవి ఆయన ఉత్తరాలు.

మరో ఉత్తరం చూశాను. అది అన్నయ్య రాసింది. అన్నయ్య పట్టణంలో సిమెంటు ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడన్నమాటేగాని మనసంతా మా ఊరి మీదే ఉండేది. వ్యవసాయం మీద కుటుంబం గడవటం కష్టంగనుక పట్నం వెళ్ళాడే గాని, సిమెంటు ఫ్యాక్టరీ దుమ్ములో బ్రతకటం సుతరామూ ఇష్టం లేదు.

"ప్రియమైన తమ్ముడికి,

కష్టపడి చదువుకున్నావు. మంచి ఉద్యోగం వచ్చింది. ఓ ఇంటి వాడి వయ్యావు – చాలా సంతోషం.

"నేనూ ఉద్యోగం చేస్తున్నా నన్న మాటే గానీ అన్నీ ఇబ్బందులే! ఉద్యోగం మానేసి మన ఊరికి వెళ్ళిపోదా మనుకుంటున్నాను. "పల్లెటూళ్ళో ఇబ్బందులు పడతాం!' అంటున్నది మీ వదిన.

"నాకు ఇక్కడ ఊపిరి ఆడటం లేదు. శ్వాసకోస సంబంధమైన జబ్బు లేం లేవు గాని, మురికి కాలువలో దిగబడిపోయి ఊపిరి ఆడనట్లుగా ఉంది నా పరిస్థితి.

"ఇంట్లో గాలి ఆడదు. చీకటి గుయ్యారం. బజారులోకి వస్తే లారీలు, బస్సులు వదిలే పొగ. రోడ్డు మీద దుర్గంధం ఒదులుతూ జీవనదిలా ప్రవహించే మురికి కాలువలు, సెంటర్‌లో మందుల వాసన.

ఫ్యాక్టరీకి వెళితే సిమెంటు ధూళి, ఫ్యాక్టరీ గొట్టాల నుంచి వచ్చే పొగ ఒంటిమీద బెత్తెడు మందం ధూళి నింపుతుంది.

"పైరు గాలి పీల్చి ఎన్నాళ్ళయిందో ! మల్లెపూల వాసనకు మొహం వాచి చచ్చిపోతున్నాను. మన దొడ్లో మల్లె పందిరి పక్కన మంచం వేసుకుని పడుకుంటే ఎంత హాయిగా ఉంటుంది!

....అమ్మ ఉలవచారు కాస్తుంటే ఆ వాసనర ఎంత మధురంగా ఉంటుంది!

.... తొలకరి వానలకు నేల తల్లి పులకరించి పోయినప్పుడు ఆ మట్టి వాసన ముక్కుకు తగిలితే గుండెల్లో గూడు కట్టుకున్న దిగుళ్లు పటాపంచలైపోతూ?

"సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు, వెన్నెల రాత్రులు – ఇవేమీ పట్టించుకోరు పట్టణంలోని వాళ్ళు. ఒక వేళ చూడా లనుకున్నా ఎత్తైన మేడలు అడ్డొస్తుంటాయి.

.... ఇక్కడ నా ముక్కు నెవరో సూదీ దారంతో కుట్టేసినట్లుగా ఇబ్బంది పడుతున్నాను.

"పిల్లలు కూడా మనుషుల్లా ఎదగడం లేదు ఈ పట్టణంలో. క్రిమినల్ సైకాలజీ వాళ్ళలో చోటు చేసుకుంటోంది. మన ఊళ్ళో చదువుకోవడానికి సౌకర్యం లేకపోయినా మానవత్వ పరిమళం మాత్రం గుబాళిస్తూనే ఉంటుంది. గుమాస్తాలాగా తయారు చేసే ఈ చదువులు పిల్లలకు రాకపోయినా మన ఊళ్ళో ఉంటే మానవతా విలువలు అబ్బుతాయి.

.... అందుకే ఉద్యోగం మానేయాలనుకుంటున్నాను."

.... నిన్ను విసిగిస్తున్నానేమో ! .... "ఇక ఉంటాను చంద్రం."

ఫ్యాక్టరీకి సైకిల్ మీద వగర్చుకుంటూ పోతున్న అన్నయ్య రూపం కళ్ళల్లో మెదిలింది.

మరో క్షణంలో వరి మోపు నెత్తిన పెట్టుకుని ఒళ్ళంతా చెమటతో తడిసిపోయి ఇంటికి వస్తున్న నాన్న రూపం.

చనిపోయిన నాన్న, అన్నయ్యలకు లేని ప్రతి రూపాలుగా మిగిలిపోయిన ఉత్తరాల వైపు మళ్ళీ మరోసారి చూశాను.

పడక కుర్చీలో పడుకుని ఆ ఉత్తరాలను గుండెల మీద ఉంచుకుంటే మనసు దూదిపింజలా తేలికైంది.

చిన్ననాటి మిత్రుడు చనిపోతే పొన్నూరు వెళ్ళి రావలసి వచ్చింది. ఎటూ జీవితంలో సాయంకాలం వచ్చేసింది కాబట్టి గొంతులో ఊపిరి ఉన్నప్పుడే పాత మిత్రులందరినీ కలిసి హైదరాబాద్ తిరిగొచ్చేసరికి వారం రోజులు పట్టింది.

ఇంట్లో అడుగు పెట్టగానే ఇంట్లో అంతా మార్పులు, చేర్పుల జరిగాయి. పాత పందిరి మంచం, చెక్క బీరువా, పడక కుర్చీ కనిపించలేదు. ఇంటినిండా కొత్త ఫర్నిచరు చోటు చేసుకుంది.

ఉద్యోగం నుంచి తను రిటైరయ్యాడు. కొడుకు కొత్తగా ఉద్యోగస్తుడయ్యాడు. పాత నీరు పోయి కొత్త నీరు వచ్చేస్తుంది. తప్పదు మరి ! అన్నీ తనకు చెప్పి చేయాలనేముంది?

చెక్క బీరువాలో అపురూపంగా దాచుకున్న నాన్న, అన్నయ్య రాసిన ఉత్తరాలు గుర్తుకు వచ్చాయి.

"బీరువాలో పాత ఉత్తరాలుండాలి ఏవిరా ? తాతయ్యా, పెదనాన్నా రాసినవి" ఆదుర్దాగా అడిగాను విజయ్‌ని.

"అవన్నీ చింపి పారేశాను డాడీ! వాళ్ళేమన్నా గొప్ప దేశ నాయకులా, కవులా? వాళ్ళ ఉత్తరాలు భద్రంగా మనం దాచుకోవాల్సిన అవసరమేముంది?" అన్నాడు విజయ్.

నా నోటివెంట మాట రాలేదు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వేడిగా, రక్తపు బిందువుల్లా చెంపల మీద జారాయి.

మోకాళ్ళ లోతు బురదలో నిలబడి నాట్లు వేస్తున్న నాన్న, చుట్టూ ఉన్న పొగతో ఉక్కిరి బిక్కిరవుతూ ఫ్యాక్టరీ పని చేస్తున్న అన్నయ్యల రూపాలు ఆ కన్నీళ్ళలో కనిపించాయి.

'గొప్ప వాళ్ళంటే ఎవరు?' అనే ప్రశ్న మెదడు పొరల్లో మెదిలింది. *

**(ఆంధ్రప్రభ వారపత్రిక - 5-12-1990)**